క్లుప్తంగా

డివిజన్‌లో 73.69 శాతం పోలింగ్ నమోదు

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా గురువారం 73.69 శాతం పోలింగ్ నమోదైంది. డివిజన్ వ్యాప్తంగా 17,045 మంది ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 12,561 మంది ఓటు హక్కు వినియోగించుకోగా వీరిలో పురుషులు 8,764 మంది, మహిళలు 3,797 మంది ఉన్నారు. మొత్తం 73.69 శాతం పోలింగ్ నమోదైంది.

నకరికల్లులో పోలయిన ఓట్లు 1,135



నకరికల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ మొదట మందకొడిగా సాగినా మధ్యాహ్నం నుంచి ఊపందుకుంది. గ్రాడ్యుయేట్‌లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,644 ఓట్లకు గాను 1,135 ఓట్లు పోలయినట్లు తహసీల్దార్ కె.పుల్లారావు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సుధీర్ భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తదితరులు పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

రాజుపాలెంలో పోలయిన ఓట్లు 897

రాజుపాలెం: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం మండల కేంద్రంలోని రాజుపాలెం మండల పరిషత్ పాఠశాలలో జరిగాయి. మొత్తం ఓట్లు 1275కు గాను 897 ఓట్లు పోలయ్యాయి. మండలంలో టీడీపీ నాయకులు హవా ప్రదర్శించారు. కొంతమేర హడావుడి జరిగినా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

క్రోసూరులో 77.64 శాతం పోలింగ్




క్రోసూరు: మండలంలో గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో రెండు బూత్‌ల ద్వారా గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకుల హడావుడి కనబడింది. పోలింగ్ అధికారులు నివేదిక మేరకు 77.64 శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం 1,548 ఓట్లకు గాను 1,202 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యవేక్షించారు. ఎన్నికల అధికారులుగా ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ వీవీ నాగరాజు, పోలింగ్ బూత్ అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

అచ్చంపేటలో 84.43 శాతం పోలింగ్



అచ్చంపేట: మండలంలోని మూడు పోలింగ్ స్టేషన్స్‌లో గురువారం జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలలో 84.43 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. మొత్తం 1,484 ఓట్లకు గాను 1,253 ఓట్లు పోలైనట్లు చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, కుటుంబసభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బెల్లంకొండలో 81 శాతం పోలింగ్



బెల్లంకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం మండల కేంద్రమైన బెల్లంకొండలో చిన్న చిన్న వివాదాలు మినహా ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు బారులు తీరారు. మండల వ్యాప్తంగా 614 మంది ఓటర్లు ఉండగా 501 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 81 శాతం పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ డి.ప్రవీణ్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూటమి నేతల కుతంత్రాలకు చెక్

మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు డబ్బులు, అధికార బలంతో ఓట్లు వేయించుకునేందుకు నానా తంటాలు పడ్డారన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును ఓడించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు కూటమి నేతలు చేశారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, వెంకట్రావు ఉన్నారు.

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

- సత్తెనపల్లి నియోజకవర్గంలో 68.40 శాతం పోలింగ్ నమోదు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ రమణాకాంతరెడ్డి
- హెల్ప్‌డెస్క్‌ల వద్ద తిష్ట వేసిన కూటమి నాయకులు



పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న పట్టభద్రులు

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నియోజకవర్గంలో చెదురు మదురు కవ్వింపు ఘటనల మినహా గురువారం ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో పలుచోట్ల కూటమి నాయకులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు పోలింగ్ కేంద్రాల సమీపంలో తిష్ట వేశారు. పట్టణంలో ఏకంగా హెల్ప్ డెస్క్‌ల వద్ద కూటమి నాయకులు కూర్చొని పట్టభద్రులను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఓవైపు పోలింగ్ కేంద్రాలు ఉంటే.. దానికి ఎదురుగానే రోడ్డుకు మరోవైపు ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసేందుకు కూటమి నాయకులు టెంట్ వేసి శిబిరం ఏర్పాటు చేశారు. కనీసం 100 అడుగుల దూరం పాటించాలన్న ప్రమాణాలను సైతం పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు అమరావతి బస్టాప్ సెంటర్‌లో స్లిప్పుల పంపిణీ శిబిరం ఏర్పాటు చేస్తే మున్సిపల్ అధికారులు వెళ్లి అక్కడ బ్యానర్లను తొలగించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఫిర్యాదులు వచ్చాయని బ్యానర్లు తొలగిస్తున్నామన్నారు. కనీసం 100 మీటర్ల దూరం పాటించని కూటమి నేతల శిబిరాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించగా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని చెప్పడం విడ్డూరంగా ఉంది. హెల్ప్ డెస్క్‌ల వద్ద కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా కూటమి నేతలు బైఠాయించినప్పటికీ అధికారులు వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 14 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 9,764 మంది ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 6,679 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68.40 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రాజుపాలెం మండలంలో 70.35 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా ముప్పాళ్ళ మండలంలో 67.12 శాతం నమోదైంది. సత్తెనపల్లి టౌన్‌లో 67.89 శాతం, సత్తెనపల్లి రూరల్ 68.75 శాతం, నకరికల్లు మండలంలో 68.80 శాతం పోలింగ్ నమోదైంది.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రిటైర్డ్ ఏడీ కొంజేటి వెంకటేశ్వరరావు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి గురువారం పరిశీలించారు. పట్టభద్రుల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్‌లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో పర్యవేక్షిస్తూ ఎన్నికల సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కె.ఆనంద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ అనంతరం బాక్స్‌లను నరసరావుపేట తరలించారు.



హెల్ప్ డెస్క్‌ల వద్ద తిష్ట వేసిన కూటమి నాయకులు



ఓటు హక్కు వినియోగించుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక

ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు, అధికారులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని పోలింగ్ కేంద్రాల్లో నాయకులు, అధికారులు గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకోగా, నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ ప్రియాంక ఓటు హక్కు వినియోగించుకున్నారు. జై భీమ్‌రావు భారత్ పార్టీ నుంచి జొన్నలగడ్డ విజయ్‌కుమార్, ఆయన సతీమణి ప్రియాంక ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రశాంతంగా ముగిసాయి. మొత్తం 1,466 ఓటర్లకు గాను 984 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 67.12 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన టీడీపీ సానుభూతి పరులను పీడీఎఫ్ అభ్యర్థి ఏజంట్‌లు అడ్డుకోవటంతో అప్పడప్పుడు చిన్నపాటి వివాదం జరిగింది.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- పెదకూరపాడులో కూటమి, పీడీఎఫ్ ఏజెంట్ల మధ్య వాగ్వివాదం
- కూటమి నేతలు బూత్‌లోకి రావడంపై పీడీఎఫ్ ఏజెంట్ల అభ్యంతరం
- మండలంలో 83.9 శాతం పోలింగ్



పోలింగ్ కేంద్రంలో కూటమి, పీడీఎఫ్ ఏజెంట్ల వాగ్వివాదం



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన పట్టభద్రులు

పెదకూరపాడు: చెదురు మదురు ఘటనలు మినహా పెదకూరపాడు మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. మండలంలో మొత్తం 1,307 మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోగా వారిలో 1,097 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 83.9 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఏఆర్వో, తహసీల్దార్ ధనలక్ష్మి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు.

కూటమి, పీడీఎఫ్ ఏజెంట్ల మధ్య వాగ్వివాదం

పోలింగ్ సందర్భంగా కూటమి, పీడీఎఫ్ ఏజెంట్ల మధ్య పలు మార్లు వాగ్వివాదం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కూటమి నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో పీడీఎఫ్ ఏజెంటు గుంటూరు మల్లేశ్వరి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ఓటు హక్కు కలిగిన వారిని మాత్రమే ఉంచి మిగిలిన వారి బయటకు పంపించారు. మధ్యాహ్నం సమయంలో కన్నెగండ్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఓటు వేసేందుకు రాగా అతని ఓటు మ్యాచ్ కాకాపోవడంతో పీడీఎఫ్ ఏజెంట్లు అడ్డుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున గందరగోళం నెలకొంది.



తుళ్ళూరులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న కొమ్మాలపాటి శ్రీధర్

ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే యర్రం

మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన 92 సంవత్సరాలు సీనియర్ సిటిజన్, రిటైర్డ్ వెటర్నరీ ఏడీ కొంజేటి వెంకటేశ్వరరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్సై వి.సోమేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

ఒకే క్లిక్.. సమగ్ర సమాచారం

ఉపాధి హామీలో అక్రమాలకు చెక్

- సమగ్ర వివరాలు తెలుసుకునేలా జన్‌మన్‌రేగా యాప్
- ఉపాధి కూలీలకు ఆసరాగా నిలుస్తున్న యాప్
- యాప్‌లో పనులు, పనిదినాలు, నగదు జమ వివరాలు
- అవినీతి, అక్రమాలపై ఫిర్యాదుకు అవకాశం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు


బెల్లంకొండ: ఉపాధి హామీ పనులు ఎక్కడ చేశారు... పని దినాల వివరాలు.. ఉపాధి కూలీల ఖాతాల్లో ఎంత సొమ్ము జమ అయ్యింది తదితర విషయాలను ఇప్పుడు వెంటనే తెలుసుకోవచ్చు. వీటి కోసం ఎంపీడీవో, తపాలా శాఖ, ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ ఇక తిరగాల్సిన పని లేదు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పనిచేస్తున్న కూలీల అరచేతుల్లోకే తీసుకొచ్చింది. ఒకే ఒక క్లిక్‌తో సమగ్ర సమాచారాన్ని, వివరాలను తెలుసుకునేందుకు జన్‌మన్‌రేగా (జేఏఎన్‌ఎంఏఎన్‌ఆర్‌ఈజీఏ) యాప్‌ను అందుబాటులో ఉంచింది. పనుల కల్పన దగ్గర నుంచి హాజరు, వేతనాల జమ అన్ని విషయాలు సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చు.

ఎలా తెలుసుకోవాలంటే...

జన్‌మన్‌రేగా యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. అందులో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు నెంబరు నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, కూలీ మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందీ, ఎంత మొత్తం జమ అయింది వంటి వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ నగదు జమ కాకుంటే అందుకు గల కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. వీటితో పాటు ఉపాధి పనుల్లో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే జన్‌మన్‌రేగా యాప్ ద్వారా వివరాలు తెలుసుకొని ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉంటాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది.



జన్‌మన్‌రేగా యాప్

అవగాహన అవసరం

జన్‌మన్‌రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలా మందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనులు చేసే చోట కూలీలకు అవగాహన కల్పిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కానీ ఈ యాప్ గురించి తెలిస్తే సిబ్బంది తమకు ఇబ్బందులు ఉంటాయని కూలీలకు అవగాహన కల్పించట్లేదు.

యాప్ ద్వారా పారదర్శకత



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్‌రేగా యాప్ పారదర్శకతకు పెద్దపీట వేస్తుంది. యాప్ ద్వారా ప్రతి విషయాన్ని తెలుసుకునే వీలుంది. కూలీలతో పాటు ప్రజలకు కూడా ఉపాధి పనుల వివరాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

– బద్దూరి శేషిరెడ్డి, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ

సూచనలు ఇస్తున్నాం



ఉపాధి హామీ కూలీలు వారి వేతనాలు ఇతర విషయాలు తెలుసుకునేందుకు జన్‌మన్‌రేగా యాప్ చక్కగా ఉపయోగపడుతుంది. ఎవరైనా ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కూలీలకు యాప్‌పై అవగాహన కల్పించాలని సూచనలు ఇస్తున్నాం.

– పి.వి.నారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి

అమరావతిలో 77.8 శాతం పోలింగ్ నమోదు

అమరావతి: మండల పరిధిలోని స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ బూత్‌లలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2,352 మంది ఓటర్లకు గాను 1,830 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 77.8 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 8 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి ఊపందుకుంది. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఈ రోజు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అక్రమాలకు తెరతీసి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిందన్నారు. అనేక చోట్ల పోలింగ్ ఏజెంట్లను బయటకు నెట్టి రిగ్గింగుకు పాల్పడిందన్నారు. దుర్గి, బెల్లంకొండ మండలాల్లో జరుగుతున్న అక్రమాలపై ఎస్పీకి, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అధికార పార్టీ కార్యకర్తలు ఇష్టా రాజ్యంగా దొంగ ఓట్లు వేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోగా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకటం దారుణమన్నారు. నైతికంగా తాము విలువలకు కట్టుబడి నైతిక విజయం సాధించామన్నారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు.



పోలింగ్ బూత్‌ల వద్ద అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



అచ్చంపేట: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సం కనుల పండువగా జరిగింది. ప్రముఖ వేదపండితులు పులుపుల ఫణికుమార శర్మ స్వామి వారి కల్యాణాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు దంపత సమేతంగా పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణ తంతు జరిపించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

బండ్ల గోపి, అడ్వకేట్
సెల్ : 9885402037

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సారె కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి శివపార్వతుల ఊరేగింపు అంగరంగ వైభవంగా గురువారం రాత్రి నిర్వహించారు. కళాకారులు వివిధ దేవతల రూపంలో అలంకరించుకొని ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు.

ఆలయం వద్ద నుంచి బేతాళ వేష ధారణలతో కనక తప్పెట్లు మేళతాళాలతో అఘోరాల ప్రదర్శనలతో ఊరేగింపు సాగింది. కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సనిమెళ్ళ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన

పరివర్తన పాఠశాలలో అన్నదానం

సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి మూగ మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, సుమలత దంపతుల కుమారుడు విప్పల వెంకట ఆషిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వారి తాతయ్య రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి గురువారం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోసూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మానసిక వికలాంగులకు ప్రతి ఒక్కరూ చేతనైన సాయం అందించాలన్నారు. తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. దాతలకు పరివర్తన నిర్వాహకుడు కె.కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.